క్లుప్తంగా

పెన్షనర్స్-2025 డైరీ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని ఉప ఖజానాధికారి కార్యాలయంలో శుక్రవారం ఉప ఖజానాధికారి కుమార్ పెన్షనర్స్ -2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ముద్రించిన ఈ డైరీ దైనందిన జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, సెక్రటరీ కేబీఆర్‌జే ప్రసాద్, ట్రెజరర్ రంగారెడ్డి, పాత్తూరు రామ కోటయ్య, బొడ్డు రామారావు, సత్తెనపల్లి సైదులు, కృష్ణ, జయనుల్లా, సుందర్సింగ్ తదితరులు ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బెల్లంకొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ డి.ప్రవీణ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడుతూ మూగ జీవాలను హింస, జూద క్రీడలు చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే వారి వివారాలను పోలీసులకు తెలియజేయాలన్నారు.

వాలీబాల్ క్రీడాకారిణికి అభినందనలు



పెదకూరపాడు: రాష్ట్ర సీనియర్ వాలీబాల్ జట్టులో పెద్దకూరపాడు గ్రామానికి చెందిన సాద్దినేని నేహ స్థానం సంపాదించింది. జీఆర్ సీఆర్‌కే శ్రీ చైతన్య పాఠశాలలో నేహ 9వ తరగతి చదువుతోంది. పాఠశాల డైరెక్టర్ గుత్తా రాము, కరస్పాండెంట్ కవిత శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

తొండపిలో రెవెన్యూ సదస్సు



తొండపి(ముప్పాళ్ళ): తొండపి గ్రామంలో దేచవరప్పాడు రెవెన్యూ సదస్సు శుక్రవారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 6 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ టి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాల కమిటీ మెంబర్‌కి సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మెంబర్‌గా నూతనంగా ఎంపికైన జవ్వాజి రామోహన్‌రావుని వాసవి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్ కార్యవర్గ బాధ్యులు శుక్రవారం సత్కరించారు. డాక్టర్ వెలుగూరి సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ గీతాంజలి, త్రిపుర మల్లు మల్లేశ్వరరావు, శిఖాకొలను రమణ, ఏలూరి పద్మాకర మురళీ కృష్ణ, జుజ్జూరి సాంబశివరావు, దూపగుంట్ల సుధాకర్, కొత్త లక్ష్మయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని ఉప్పరపాలెంలో వినుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారికంగా గొలుసు దుకాణం నిర్వహిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి డ్యూటీ పెయిడ్ లిక్కర్ 12 బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు.

తరువు తరుక్కుపోతోంది..!

- విచ్చలవిడిగా పొలాల వెంబడి ఉన్న చెట్ల నరికివేత
- అనుమతులు లేకుండా కలప వ్యాపారం
- అటవీ వృక్షాలకు రక్షణ కరువు
- గుట్టుచప్పుడు రాత్రిళ్లు తరలింపు
- పట్టించుకోని అధికారులు



వెంకటాయపాలెం గ్రామంలోని పొలాల్లో నరికివేసిన వృక్షం

బెల్లంకొండ: చెట్లను కాపాడుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ఇది ప్రచార నినాదంగానే మిగిలిపోతోంది. క్షేత్రస్థాయిలో వృక్షాలు పర్యవేక్షణ లేకపోవడంతో కనుమరుగవుతున్నాయి. కలపకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో అడ్డూఅదుపు లేకుండా చెట్ల నరికివేత జరుగుతోంది. అక్రమంగా కలప రవాణా చేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చెట్లు మానవాళికి ఆయువుపట్టు. ఆ ఆయువును ఆధునిక యంత్రాలతో నిమిషాల్లో కూలదోస్తూ తీసేస్తున్నారు. నిన్నటి వరకు చల్లని గాలి, నీడనిచ్చిన వృక్షాలు తెల్లవారేసరికి మోడులా దర్శనమిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని పొలాలు, అటవీ ప్రాంతాల్లోని చెట్లను నరికి వేసి, కలపను పిడుగురాళ్ల, సత్తెనపల్లి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా..

మండలంలోని మాచాయపాలెం, పాపాయపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, ఎమ్మాజీగూడెం అలాగే పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాలు అయినా కోళ్లూరు, భోధనం, చిట్యాల, గొల్లపేట గ్రామాల్లో విచ్చలవిడిగా చెట్లను నరికి వేస్తున్నారు. రైతుల నుంచి వారి పొలాల్లో ఉన్న చెట్లను కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న భారీ వృక్షాలను సైతం నరికి కలపను రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఈ దందా జోరుగా సాగుతోంది.

ఇటుక బట్టీలు, హోటళ్లకు.

గ్రామాల్లో చింత, వేప, దురిసెన, కుంకుడు, కానుగ చెట్ల ద్వారా వచ్చిన కలపకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. కలపను గృహోపకరణాల తయారీతో పాటుగా వంట చెరకుగా వినియోగిస్తున్నారు. కలపను ఇటుక బట్టీలు, హోటళ్లకు అధికంగా తరలిస్తున్నారు. పలు గ్రామాల నుంచి ప్రతిరోజు ట్రాక్టర్లు, ట్రాలీల ద్వారా రాత్రిళ్లు అక్రమంగా తరలిస్తున్నారు. పట్టపగలు తరలిపోతున్నా..పట్టించుకునే అధికారులు లేరు. కలప అక్రమ రవాణాపై ప్రజలు సమాచారం అందించినా అధికారులు మౌనంగా ఉండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అటకెక్కిన వాల్టా చట్టం

అనుమతులు లేకుండా చెట్లు నరికినా, బోర్లు వేసినా వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలి. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కలప అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ అటవీశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీవారి దేవాలయాల్లో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. వడ్డవల్లి శ్రీరామాలయం, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివార్లకు శుక్రవారం నిజపాద దర్శన అలంకారం చేశారు. సీతారామచంద్ర లక్ష్మణ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి దివ్య అలంకార శోభిత మూర్తిగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్ల కృపకు పాత్రులయ్యారు.



నిజపాద దర్శన అలంకరణలో శ్రీవారు



దివ్య అలంకార శోభితమూర్తిగా..

స్టడీ మెటీరియల్ పంపిణీ

ముప్పాళ్ళ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను దాతల సాయంతో యుటీఎఫ్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు మెటీరియల్స్ దోహదపడతాయని యుటీఎఫ్ నాయకులు మువ్వా సురేష్, లక్ష్మీనారాయణ తెలిపారు. 103 మంది విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి నాగబోతు పరమేశ్వరరావు, గణిత ఉపాధ్యాయుడు కొర్రపాటి లక్ష్మీనారాయణ వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగేంద్రమ్మ, యూటీఎఫ్ నాయకులు సుబ్బారావు, విజయ్, షరీఫ్ పాషా పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు పూలే



పూలే చిత్రపటానికి బీసీ సంఘాల నాయకుల నివాళి



బీసీ బాలుర వసతి గృహంలో పూలే చిత్రపటానికి విద్యార్థుల నివాళి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: స్త్రీ విద్యాభివృద్ధికి కృషిచేసిన దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలోని 5వ వార్డ్ ప్రాథమిక పాఠశాలలో సంఘ నాయకులు ప్రత్తిపాటి హరేకృష్ణ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు గోవిందు, దస్తగిరి, నాగేశ్వరావు, బ్రహ్మం, చిన్న షరీఫ్, వెంకట్రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. హాస్టల్ సంక్షేమ అధికారి కె.కిరణ్ కుమార్, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమేష్ పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. సంక్షేమ అధికారి కె.కిరణ్ కుమార్‌ను సన్మానించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ సురేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.
- ఫణిదం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ మేడే వెంకటరమణ, గ్రామ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పూలే సేవలు అనిర్వచనీయం

అచ్చంపేట: సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయనిగా విద్యాభివృద్ధికి చేసిన కృషి అనిర్వచనీయమని అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమం శుక్రవారం అచ్చంపేటలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. బీసీ నాయకులు ఆంజనేయులు, నరసింహారావు, సలికేటి సింహరాయలు పాల్గొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. డీబీఆర్సీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ప్రిన్సిపల్ అరుణకుమార్, ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు సందెపోగు అశోక్ పాల్గొన్నారు.



సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిల్కా చంద్రయ్య

మహిళా లోకానికి ఆదర్శమూర్తి పూలే

నకరికల్లు: మహిళా లోకానికి ఆదర్శమూర్తి శ్రీమతి సావిత్రిబాయి పూలే అని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకడావత్ కోటా నాయక్ అన్నారు. భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు పూలే 194వ జయంతి స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అసమానతలు ఎన్నో కష్టాలను ఎదుర్కొని మహిళలకు చదువు చెప్పి సమాజానికి మార్గదర్శిగా నిలిచిన వీర వనిత అని కొనియాడారు. వవిధ సంఘాల అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, వాంకడావత్ రవి నాయక్, షేక్.సైదా, షేక్.ఖాదర్‌వలి, వినుకొండ మస్తాన్‌వలి, చిన్నసైదా, శ్రీనివాసరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

బెల్లంకొండ: సావిత్రి బాయి పూలేను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాకాధికారి బాల సుందరరావు తెలిపారు. విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల జెడ్పీ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, హెచ్‌ఎం అన్నపూర్ణ మాట్లాడుతూ సావిత్ర బాయి సేవలనుకొనియాడారు. ఉపాధ్యాయులు డి.కోటేశ్వరరావు, వెంకటలక్ష్మీ, భాగ్యమ్మ, వెంకటేశ్వర్లు, హనుమతంరావు, పిచ్చియ్య, సాల్మాన్‌రాజు పాల్గొన్నారు.

ఆట పాటలతో కూడిన విద్యను అందించాలి

–జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ



సత్తెనపల్లి: చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎల్ చంద్రకళ అన్నారు. ధూళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయిలో ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష నేతృత్వంలో జరుగుతున్న శిక్షణ తరగతులు ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కనీస భాష, గణిత సామర్థ్యాలు పెంపొందించేందుకు ఆట పాటలతో కూడిన విద్య అవసరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు చిన్నారులను ఆకర్షించే రీతిలో విద్య నేర్పించాలన్నారు. ఇందుకు సంవత్సరంలో 20 రోజులు శిక్షణ పొందుతారని, ఆరు రోజులు ప్రత్యక్షంగా, 14 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ పొంది క్షేత్రస్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణలో ఏఎంఓ శ్రీనివాసరావు, జీసీడీఓ రేవతి, మండల విద్యాశాఖ అధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, జిల్లాలోని 320 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

నాదెండ్ల: మిర్చిలో సమగ్ర సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు చెప్పారు. సాతులూరులో మిర్చి సాగు చేస్తున్న రైతులకు ప్లాంట్ ప్రొటెక్షన్ కిట్లపై అవగాహన కల్పించారు. మిర్చి సాగులో రసాయనిక ఎరువుల పిచికారీ సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సరైన మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించాలన్నారు.

'జల్ జీవన్ మిషన్' పురోగతిపై సమీక్ష



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఇంటింటికి రక్షిత జలం అందించేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ పనులు గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశించారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పనుల ప్రగతిపై సమీక్షించారు. రక్షిత పథకాలు మూలన పడి ఉంటే అందుకు గల కారణాలు తెలియజేయాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీల్లో రక్షిత పథకాలు వాడుకలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వేసవికి ముందే తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు దరువూరి నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూస్ డీఈ, ఏఈలు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పట్టణంలోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి గుడి వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రెవెన్యూకు-9, సర్వేకు-4, పెన్షన్లకు-36, రైస్ కార్డులకు-47 మొత్తం 96 దరఖాస్తులను ప్రజలు అందించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, తహసీల్దార్ కేఎస్.చక్రవర్తి, ఆర్ఐ బోస్‌బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రాజుపాలెం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు పేర్కొన్నారు. బలిజేపల్లి ఎస్సీ కాలనీలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఏఎన్ఎం పి.శ్రీకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో పీవీ సురేష్, సంఘ సభ్యులు బి. సుబ్రహ్మణ్యం, కాళ్ల కృష్ణమూర్తి, జి. నాగేంద్రుడు, సామ్రాజ్యలక్ష్మీ, సుందరరావు, ఎ.కోటేశ్వరరావు, వై.వి. సుబ్బయ్యశర్మ, శేషయ్య, రాఘవయ్య, దుబ్బల దాసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గ్రామ/వార్డు సచివాలయ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండరును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరిమి రాంబాబు, ఈజిల్లా యూనియన్ నాయకులు కె.ఆంజనేయులు, డి.నాగబాబు, రాచకొండ ఆదిలక్ష్మి, పవన్ కుమార్, సీహెచ్ మీనాక్షి, శ్రీకాంత్ ఉన్నారు.

పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

శావల్యాపురం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచులు, వార్డు సభ్యులు కీలకపాత్ర పోషించాలన్నారు. పంచాయతీ నిధులు రూ. 6లక్షలతో శావల్యాపురంలో మంచినీటి పథకం మరమ్మతులు, చెత్త సంపద కేంద్రం వినియోగంలోకి తేవటం, కుక్కలను పట్టించటం తదితర తీర్మానాలు చేసినట్లు కార్యదర్శి యాకోబు తెలిపారు.